క్లుప్తంగా

శెట్టిబలిజ సంఘం తరఫున ఆర్థిక సాయం

కపిలేశ్వరపురం: వెదురుమూడికి చెందిన ఆటో డ్రైవర్ గుత్తుల దుర్గాప్రసాద్ ప్రమాదవశాత్తూ చనిపోయారు. జీవనాధారం కోల్పోయిన దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం తరఫున సోమవారం రూ.ఆరు వేల ఆర్థిక సాయం అందించారు. దుర్గాప్రసాద్ భార్య, కుమార్తెలకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వాసంశెట్టి వాసు, కార్యదర్శి వనుం పార్థసారథి, కోశాధికారి శీలం రాంబాబు, గౌరవాధ్యక్షుడు పితాని సూర్యచంద్రరావు, వెదురుమూడి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు సోమేశ్వరంలో అయ్యప్ప లక్ష బిల్వార్చన

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో బుధవారం మహాగణపతి హోమం, దేవీ కుంకుమార్చన, అయ్యప్ప లక్ష బిల్వార్చన నిర్వహిస్తారు. స్థానిక కర్రి ఆదినారాయణరెడ్డి గురుస్వామి 36వ మాలధారణ సందర్భంగా లక్ష బిల్వార్చన నిర్వహించనున్నారు. పూజ్యం నాగేశ్వరశర్మ పూజలు నిర్వహిస్తారు. ఉదయం 8 గంటలకు సువాసినులచే అమ్మవారికి కుంకుమార్చనలు, మధ్యాహ్నం కేరళ మంగళ వాయిద్యాలతో స్వామివారి రథోత్సవం, పేటతుల్లి జరుగుతాయి. కేరళ తాంత్రిక యుక్త సంప్రదాయబద్ధంగా పడిపూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆదిరెడ్డి గురుస్వామి తెలిపారు. విశిష్ట అతిథులుగా ద్వారూడి ఎస్.ఎల్.కనకరాజు గురుస్వామి, కాకినాడ వేలు గురుస్వామి, రాజమహేంద్రవరం, కుసుమంచి సత్య శ్రీనివాసరావు గురుస్వాములు హాజరవుతారు.

వేంకటేశునికి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలోని అలివేలు మంగ, గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామికి సోమవారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల పర్యవేక్షణలో ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామికి పంచామృతాభిషేక పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా కామాక్షమ్మ గ్రామోత్సవం

మండపేట: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని టౌన్ హాలు వద్ద కొలువైన శ్రీకామాక్షి అమ్మవారి గ్రామోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. శ్రీకామాక్షి ఏకామేశ్వర ఆలయ కమిటీ, విశ్వబ్రాహ్మణ, వండ్రంగి పనివార్ల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆయా సంఘాల నాయకులు త్రిపురారి మాణిక్యాలరావు, జేసీ ప్రసాద్, వీరమల్లు శ్రీనివాస్, తామరపల్లి భాస్కరరావు, పట్నాల శ్రీనివాస్, కోటిపల్లి కృష్ణ, వేముల శ్రీరామమూర్తి, కోటిపల్లి రాంబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు భట్లపాలికలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

కె.గంగవరం: మండలంలోని భట్లపాలికలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైద్యులు అందుబాటులో ఉంటారని సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరం వద్ద రక్త పరీక్షలతో పాటు పలు పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తారని పేర్కొన్నారు.

భీమేశ్వరాలయంలో శమీ పూజ



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శమీ పూజ

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ధూప, దీప సేవ అనంతరం జమ్మిచెట్టు వద్ద ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో దేవదాయ వేగాయమ్మపేట జమిందారు వాడ్రేవు సుందర రత్నాకర్‌ల సమక్షంలో శమీ పూజ నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం, ప్రసాద వితరణ చేశారు. శమీ పూజ అనంతరం స్వామివార్లను వేగాయమ్మపేట దివాణానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. రాత్రి 11 గంటలకు దసరా వేడుకల ముగింపు సందర్భంగా మాణిక్యాంబా అమ్మవారిని, భీమేశ్వరస్వామిని సర్వాంగసుందరంగా అలంకరించి గజవాహనంపై గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ హోమందారులు భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం

రామచంద్రపురం రూరల్: సినీ హీరో ప్రభాస్ పుట్టినరోజు పురస్కరించుకుని ద్రాక్షారామ బోస్ బొమ్మ సెంటర్‌లో ప్రభాస్ డైహార్ట్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదానం నిర్వహించారు. అసోసియేషన్ నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, అధ్యక్షుడు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), కార్యదర్శి కొప్పిశెట్టి శ్రీను, కోశాధికారి పేరుబోయిన పవన్‌కుమార్, ప్రభాస్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతు బజార్‌కు మోక్షం

- రూ.కోటి వ్యయంతో నిర్మాణం
- 28 షాపుల్లో రైతుబజార్
- మున్సిపల్ సాధారణ నిధులతో మరో 28 షాపులు
- తీరనున్న పట్టణ వాసుల కష్టాలు



నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు బజార్

రామచంద్రపురం: ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న రైతు బజార్ కల నేటికి నెరవేరుతుంది. రామచంద్రపురం పట్టణంతో పాటుగా పరిసర ప్రాంతాల ప్రజలకు, రైతులకు మేలు చేకూరుస్తూ రైతు బజార్ మార్కెట్‌కు కూత వేటు దూరంలో త్వరలో ప్రారంభం కానుంది. మంత్రి వేణుగోపాలకృష్ణ చొరవతో ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయగా ప్రస్తుతం పట్టణం నడిబొడ్డున నిర్మాణం పూర్తి చేసుకుని త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుంది. పురపాలక పరిధిలో సుమారుగా 50 వేల మంది జనాభా ఉండగా 17 వేల కుటుంబాల వారున్నారు. వీరితో పాటుగా నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం కాజులూరు మండలాలకు చెందిన వారు, పక్కన ఉన్న మండపేట నియోజకవర్గంలోని రాయవరం మండలం పసలపూడి, వెంటూరు, చెల్లూరు, నదురుబాద, మాచవరం, సోమేశ్వరం తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు కూడా రామచంద్రపురం మార్కెట్‌కు వస్తుంటారు. నియోజకవర్గంలోని ద్రాక్షారామతో పాటుగా పట్టణంలోను కూరగాయల కొనుగోళ్లకు వస్తుంటారు. అయితే ఎక్కడా లేని విధంగా పట్టణంలో కూరగాయలు అధిక ధరలు ఉండేవి. దీంతో దివంగత డాక్టర్ వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద మున్సిపాలిటీ స్థలంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేశారు. కానీ కాలక్రమేణా కూరగాయల దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడి రైతు బజార్‌ను నిర్వీర్యం చేశారు. గతంలో రైతుబజార్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరినా టీడీపీ హయాంలో అది నెరవేరలేదు.

మంత్రి వేణు చొరవతో..

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చొరవతో పట్టణంలో తిరిగి రైతు బజార్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో రైతు బజార్‌లు ఏర్పాటు చేస్తుండగా అందులో భాగంగా రామచంద్రపురానికి ఒక రైతు బజార్‌ను మంజూరు చేసి రూ.కోటి నిధులను విడుదల చేస్తూ గతంలోనే జీవోను జారీ చేశారు. ప్రభుత్వం రైతు బజార్‌ను మంజూరు చేయటంతో మున్సిపాలిటీలో స్థలాన్ని కేటాయించారు. గతంలో మాదిరిగా కాకుండా పెద్ద మార్కెట్‌కు దగ్గరలోనే వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా రైతు బజార్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి వేణు అధికారులకు సూచించారు. దీంతో 23వ వార్డులోని శివాలయం రోడ్డు నుంచి వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఉత్తరం వైపున ఉన్న పురపాలక సంఘానికి చెందిన 1.48 ఎకరాల స్థలంలో 25 సెంట్ల స్థలాన్ని రైతు బజార్‌కు కేటాయిస్తూ 2021 జూలై 26న జరిగిన మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేస్తూ కౌన్సిల్ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు స్థలాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వారికి కేటాయించి రైతు బజార్‌ను పూర్తి చేశారు.

తీరనున్న కష్టాలు



రైతు బజార్‌ను ఏర్పాటు చేయటం మూలంగా పట్టణంతో పాటుగా పరిసర ప్రాంతాల ప్రజలు సుమారుగా 2 లక్షల మందికి ఉపయోగం కాగా 20 వేల మంది రైతులకు డైరెక్ట్‌గా రైతు బజార్‌లో తమ కూరగాయలను అమ్ముకునే వీలుంటుంది. రైతులు దళారుల బారిన పడకుండా తమకు నచ్చిన ధరకు అమ్ముకునే వీలుండగా వినియోగదారులకు తక్కువ ధరకు కూరగాయలు లభించనున్నాయి.

– గుణ్ణం రామకృష్ణ, కొత్తూరు

ప్రజలకు చేరువలో రైతుబజార్



రోడ్డు పక్కన, ఇతర ప్రాంతాల్లో కూరగాయలు అమ్ముకునే వారు దుకాణాలు వేస్తున్నారు. వీరి కష్టాలను తొలగించి ప్రజలకు అత్యంత చేరువలో రైతు బజార్‌ను ఏర్పాటు చేయటం అభినందనీయం. పెద్ద మార్కెట్‌కు సమీపానే ప్రజలకు చేరువలో రైతు బజార్‌ను తీసుకురావడం ద్వారా ప్రజలకు ఎంతో ఊరట కలిగిస్తుంది.

– కంచుమర్తి బాబూరావు, లలితానగర్

ఘనంగా ముగిసిన దేవీ నవరాత్ర మహోత్సవాలు



కాజులూరులో దేవీనవరాత్ర మహోత్సవాల ముగింపు వేడుకల్లో నృత్యం చేస్తున్న పగటి వేషగాళ్లు

కాజులూరు: మండల గ్రామాల్లో గత 10 రోజులుగా కొనసాగిన దేవినవరాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. గత నెల 15వ తేదీ ఆదివారం గ్రామాల్లో భక్తులు నవరాత్ర ఉత్సవాలను చేపట్టారు. దుర్గాదేవి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆలయాల ఎదుట చలువ పందిళ్లు వేశారు. ఆలయాలు లేని పలు గ్రామాల్లో సైతం ప్రధాన కూడళ్లలో తాటాకు పందిళ్లతో మండపాలు నిర్మించి భక్తులు ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆలయాల్లో రోజుకో విధంగా ప్రత్యేక హోమాలు, లక్షపత్రిపూజ, లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. నవరాత్రుల అనంతరం మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ నిర్వాహక కమిటీ సభ్యులు సోమ, మంగళ వారాల్లో ముంగిపు కార్యక్రమాలు నిర్వహించారు. గరగ నృత్యాలు, పగటి వేషాలతో, బాజా భజంత్రీలతో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి సమీపంలోని కాలువల్లో స్నానాలు చేయించి ఉత్సవాలకు ఉద్వాసన పలికారు. పలు గ్రామాల్లో అన్న సమారాధనలు జరిగాయి.

జయజయహే మహిషాసుర మర్దిని

- ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అంగరలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



శివల అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

రాయవరం: ఈ నెల 15న ప్రారంభమైన శరన్నవరాత్ర ఉత్సవాలు విజయ దశమి పర్వదినంతో మంగళవారం ఘనంగా ముగిశాయి. మండలంలోని రాయవరం, వెదురుపాక, వి.సావరం, లొల్ల, నదురుబాద, సోమేశ్వరం, మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో దసరా ఉత్సవాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో చలువ పందిళ్లు వేసి శక్తి స్వరూపిణిగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారి మండపాల్లో సామూహిక కుంకుమ పూజలు చేశారు. విజయ దశమి సందర్భంగా అమ్మవారిని పలు చోట్ల నయనానందకరంగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నూతన వాహనాలు కొనుగోలు చేసిన వారు ఆలయాల వద్ద వాహన పూజలు, కార్మికులు ఆయుధ పూజలు చేశారు. కాగా సోమవారం రాయవరం దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. కాల్దారి త్రినాథ్ శర్మ అర్చకత్వంలో పూజాదికాలు నిర్వహించారు.

కోర్కెలు చీటీలు కట్టిన భక్తులు..

సాయంత్రం సమయంలో పలువురు భక్తులు జమ్మి చెట్టు వద్దకు వెళ్లి కోరిన కోర్కెలు తీర్చాలంటూ జమ్మిచెట్టుకు చీటీలు కట్టారు. 'శమీ శమేత పాపం, శమీ శత్రు వినాశనం, అర్జునస్య ధనుర్ధారి, శ్రీ రామస్య ప్రియదర్శనం' అంటూ పేపరుపై భక్తులు శమీ మంత్రాన్ని, కోరికలను రాసి జమ్మిచెట్టుకు కట్టారు. విద్యార్థులు, యువకులు, మహిళలు ఎక్కువగా జమ్మిచెట్టు వద్ద శమీ పూజలు చేశారు. పాండవులకు లభించిన విజయాలను తమకు కూడా అందించాలని వారు శమీ వృక్షాన్ని వేడుకున్నారు. పలు ఆలయాల్లో అమ్మవారిని రాజరాజేశ్వరి రూపంలో అలంకరించారు.

కపిలేశ్వరపురం: శరన్నవరాత్ర ఉత్సవ శిబిరాల్లో సోమ, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 19 గ్రామాల్లో మహిళలు పుణ్య స్నానమాచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ పూజలు చేశారు. మహిళా భజన భక్త బృందం సభ్యులు కోలాటాన్ని ప్రదర్శించారు. శిబిరాల్లో అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

శివలలో..

కె.గంగవరం: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శివలలో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళా భక్తులు ఆలయం వద్దకు భారీగా చేరుకుని పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నదానంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామానికి చెందిన మార్ని పుల్లయ్య తనయుడు గణేష్ అమ్మవారి పేరున రూ.లక్ష డిపాజిట్ చేశారు.



సోమేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి వారు



రాయవరంలో పూజలందుకున్న పార్వతీ సమేత రాజేశ్వరస్వామి వారు

గొల్లపాలెంలో ఘనంగా ఏనుగుల సంబరం



గొల్లపాలెం గ్రామ వీధుల్లో పగటి వేళ బండిపై ఊరేగిస్తున్న చిన్న ఏనుగు



గొల్లపాలెం గ్రామ వీధుల్లో రాత్రి వేళ ట్రాక్టరుపై ఊరేగిస్తున్న పెద్ద ఏనుగు

కాజులూరు: రామచంద్రపురం నియోజకవర్గ గ్రామాల్లో ప్రసిద్ధి గాంచిన గొల్లపాలెం ఏనుగు సంబరం ఈ ఏడాది వైభవంగా జరిగింది. ఏటా విజయదశమి పురస్కరించుకుని గ్రామంలో ఏనుగుల సంబరాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తుంటారు. అయితే కరోనా కారణంగా గత రెండేళ్లుగా ఏనుగుల సంబరం నామమాత్రంగా జరిగింది. ఈ ఏడాది పరిస్థితులు చక్కబడటంతో స్థానికులు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ గ్రామ వీధుల్లో ట్రాక్టర్‌పై పెద్ద ఏనుగును ఊరేగించిన స్థానికులు మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకూ చిన్న ఏనుగును ఊరేగించారు. గ్రామంలోని వెలమ కులస్తుల ఆధ్వర్యంలో చిన్నేనుగు సంబరం జరుగుతుండగా కాపు, బలిజ కులస్తుల ఆధ్వర్యంలో పెద్ద ఏనుగు సంబరం నిర్వహిస్తున్నారు. చిన్న ఏనుగును ఎండ్లబండి మాదిరి బండిపై ఉంచి గ్రామస్తులే జేజేలు పలుకుతూ తోసుకుంటూ ముందుకు సాగుతారు. పెద్ద ఏనుగునైతే ట్రాక్టర్‌పై ఊరేగిస్తారు. ఎండుగడ్డి, తెల్లని వస్త్రం, తదితర వస్తుసామగ్రితో తయారు చేసిన భారీ ఏనుగుల ప్రతిమలను ఊరేగించే సమయంలో ఉత్సవం మాదిరి సంబరం జరుగుతుంది. ఏనుగుల ప్రతిమలను భక్తులు భేతాళుని ప్రతిరూపంగా భావించి పూజలు నిర్వహిస్తుంటారు. గరగనృత్యాలు, కోల సంబరాలు, కోయడ్యాన్సులు, గారడీ, బ్యాండ్ మేళాలతో ఏనుగుల ఊరేగింపు సంబరం కోలాహలంగా సాగింది. నియోజకవర్గ గ్రామాలతో పాటు కాకినాడ పట్టణ, రూరల్ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో జనం ఏనుగుల సంబరాలను తిలకిస్తారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న సుబ్బారెడ్డి తదితరులు

మండపేట: మండలంలోని అర్తమూరులోని సాయినాథుని ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఉప సర్పంచ్, కమిటీ ఉపాధ్యక్షుడు కర్రి సత్యనారాయణరెడ్డి (జంబయ్య) ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని తొమ్మిది రోజుల క్రితం 50 మందికి పైగా భక్తులు సాయిమాలలు ధరించి రోజూ పూజలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా స్వామివారిని నెమలి పింఛాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వేద పండితులు పెద్దింటి మణికుమార్‌శర్మ పర్యవేక్షణలో పౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, తాడి శేషారెడ్డి, నల్లమిల్లి అంజిరెడ్డి దంపతులు శ్రీచక్ర పూజ, లక్ష్మీగణపతి హోమం, చండీహోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

నేడు ద్వారపూడిలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

మండపేట: మండలంలోని ద్వారపూడిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఆ పంచాయతీ సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తెలిపారు. పంచాయతీ స్థలంలో ప్రజాభాగస్వామ్యం రూ. 2.2 కోట్ల వ్యయంతో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వర గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్, ప్రజా విరాళం సుమారు రూ.10 లక్షలతో నిర్మించిన తోట త్రిమూర్తులు బస్ షెల్టర్, 'నాడు- నేడు' నిధులు రూ. 1.5 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, రూ. 15.6 కోట్లతో ద్వారపూడి నుంచి వేములపల్లి మీదుగా పీరా రామచంద్రపురం వరకు నిర్మించిన బీటీ రోడ్డును ఎమ్మెల్సీ తోట ప్రారంభిస్తారన్నారు. అలాగే రూ.38 లక్షల వ్యయంతో నిర్మించే హెల్త్ ల్యాబొరేటరీ నిర్మాణానికి, గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేస్తారన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి గ్రామంలోని బంగారమ్మ కాలనీ నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వారు తెలిపారు.

ద్రాక్షారామ ప్రధాన కూడలి వద్ద ఫ్లెక్సీ తొలగించాలి



ద్రాక్షారామ బోస్‌బొమ్మ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో బోస్ బొమ్మ ప్రధాన కూడలి వద్ద ద్రాక్షారామ పోలీసులు ఏర్పాటు చేసి ఫ్లెక్సీని తొలగించి ట్రాఫిక్‌కి ఇబ్బంది లేని చోట పెట్టుకోవాలని సర్పంచ్ కొత్తపల్లి అరుణ ద్రాక్షారామ పోలీసులను కోరారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఏ విధమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని నోటీసు పెట్టడం జరిగిందన్నారు. దానిని అమలు చేయాల్సిన పోలీసులే అక్కడ ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం సరికాదని, ఫ్లెక్సీ వేరే చోటుకి మార్చుకోవాలని ఆమె ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్‌ను కోరారు.

ద్రాక్షారామ వాకర్స్ క్లబ్ ఏర్పాటు



ద్రాక్షారామ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో 'ద్రాక్షారామ వాకర్స్ క్లబ్'ను సోమవారం నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. క్లబ్ గౌరవాధ్యక్షుడిగా ప్రముఖ దాత సత్తి సుబ్బారెడ్డి, అధ్యక్షుడిగా తెలగాని తిలక్‌బాబు, సంయుక్త అధ్యక్షులుగా తోట శ్రీను, నామా వెంకన్నబాబు, ప్రధాన కార్యదర్శిగా నక్కా భీమశంకరం, కోశాధికారిగా అనిశెట్టి అప్పారావు, ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీను, గుడాల సుబ్బారావు, చిక్కాల సూరిబాబు, అనిశెట్టి సత్యం, కార్యదర్శులుగా గంపల సోమరాజు, నున్న నరసింహమూర్తి, పోతంశెట్టి రాంబాబు, గునిపె దొరబాబు, కార్యవర్గ సభ్యులుగా బి.విజయకుమార్, కర్రి శంకరం, కురసా మాణిక్యం, కొండమూరి వెంకట్రాజు, శాకా శంకరరావులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

వినూత్న శోభ తెచ్చిన అమ్మ అవతారాలు



ఉదయం మహిషాసుర మర్దినిగా, మధ్యాహ్నం రాజేశ్వరిదేవిగా ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారు

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారికి ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విశేష అమ్మ అవతారాలు అలంకణలు చేయడంతో ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయం వినూత్న శోభను సంతరించుకుంది. దసరా పర్వదినాల్లో చివరి రోజైన సోమవారం మాణిక్యాంబా అమ్మవారు ఉదయం 12 గంటల వరకు మహిషాసురమర్దినిగా, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాజరాజేశ్వరి అమ్మవారిగా ఒకే రోజు రెండు అవతారాల్లో భక్తులను ఆశీర్వదించారు. ఆలయం మొత్తం విద్యుద్దీపాలకరణలతో చేసిన అలంకరణ రాత్రి పూట ఆలయం వద్ద సప్తగోదావరి నదిలో రాత్రి చీకటిలో ప్రతిఫలించి భక్తుల మనస్సుల్లో బలమైన ముద్ర వేసుకుంది. ఆలయం లోపల విశేష పూజలు, ఆలయం వెలుపల చిన్నారుల శాస్త్రీయ నృత్యాలతో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సహకారంతో విస్తృత ఏర్పాట్లు చేశారు.

ట్రస్ట్ స్థలంలో అక్రమంగా ప్రవేశించారని కేసు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో పైండా వెంకన్న రామకృష్ణ ట్రస్ట్ స్థలంలోకి 13 మంది అక్రమంగా ప్రవేశించారని వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ట్రస్ట్ స్థలం మెయిన్ గేటు తాళం పగులగొట్టి వాచ్‌మన్ వారిస్తున్నా వినకుండా లోనికి ప్రవేశించి జేసీబీ, ట్రాక్టర్లతో పనులు చేయించారని పైండా సత్య శ్రీరామ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.